కథ

# బ్రతుకు బంధం

**వడలి రాధాకృష్ణ**

'అసుర సంధ్య ఎర్రని కాంతిని చెట్లనిండా పరచి ఇవన్నీ నావే అన్నట్లుగా చూస్తోంది. ఈ తరహా అన్యాయాలకు, అక్రమాలకూ నేనే సాక్ష్యం కావలసి వచ్చిందే అని లజ్జతో, ఎర్రని ముద్దమందారం లాంటి మోముతో ఎవరైనా చూస్తారేమోనన్న భీతితో, మాతృమూర్తి కడుపులో తలదాచుకుంటున్నాడు 'కర్మసాక్షి'.

"ఏమిటి నాన్నా! ఇంట్లో అలా ఖాళీగా కూర్చోకపోతే, కొంచెం మార్కెట్‌కి వెళ్లి సామానులు తెచ్చిపెట్టవచ్చు కదా."

"లేదురా అబ్బాయి రాత్రి నుండి ఒకటే నీరసం, ఆయాసం, చాలా ఇబ్బందిగా ఉందిరా"

"చెప్పిన పనిని తప్పించుకొనేందుకు సాకులు ఎన్నైనా చెప్పొచ్చు. కొంచెం నీ కోడలికి కావలిసినవి తెచ్చిపెట్టమంటే పనికిమాలిన వెధవ వాగుడు వాగుతావే. మాకు ఏ విధంగానూ ఉపయోగపడని నీకు రోజూ తిండి పెట్టడం కూడ దండగే."



ఒక్కసారి సూర్యరామం కంటిలో నీళ్లు తిరిగాయి.

"అదేమిటిరా అలా అంటావు! నేను తప్పించుకుంటున్నానా, నిన్న రాత్రి నుండి ఆయాసంతో సతమతమవుతుంటేనూ. రాత్రి నిన్ను నిద్ర లేపుదామనుకున్నా, ఒక సమయంలో ప్రాణం పోతుందేమోనని భయం వేసింది."

"పోయినా బాగుండేది! వెధవ శని వదిలిపోయేది. ముసలి సంతని భరించలేక ఛస్తున్నాం" కోపంతో ఈసడించుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేసుకొని బయటకు వెళ్లిపోయాడు గోపాల్.

సూర్యరామం అవాక్కయిపోయి, అలుముకున్న ఆవేదనతో నిస్సత్తువగా పడక కుర్చీలో కూలబడిపోయాడు. మనసు టన్నుల బరువును మోస్తుంటే, ఎవరికీ చెప్పుకోలేని వేదనతో సతమతమవుతున్నాడు. కన్నకొడుకు తనని ఓ పనికిమాలిన వాడిలా ఈసడించుకుంటుంటే ఈ ప్రాణం పోయినా బాగుండుననిపించింది. డబ్బయోపడిలో తను పడుతున్న హృదయవేదన పగవాడిక్కూడా రాకూడదు.

'అతని ఏడుపు...బాధ...కరగడంలేదు. రోజూ సూర్యచంద్రులు ఉదయించి అస్తమిస్తూనే ఉన్నారు. నిత్యం తనని ఓదార్చడానికి వచ్చారేమోనని ఆశపడేవాడు. కానీ వారూ ఈ లోకంలో ఒక భాగమే. తన వేదన వారికెందుకు? వస్తున్నారు...వెళ్తున్నారు. వెళ్లి మళ్లీ వస్తూనే ఉన్నారు.'

జీవితాన్ని పంచుకున్న భార్య తన కంటి ముందే సుమంగళిగా వెళ్లిపోయింది. ఇక ఈ మనుషుల మందలో తాను ఏకాకిగానే బ్రతుకుతున్నాడు. ఒక్కసారి సూర్యరామం దృష్టి ఎదురుగా గోడకి తగిలించబడి ఉన్న తండ్రి ఫోటో వైపు మళ్లింది. దాన్ని చూస్తుంటే ఆవేదన పెల్లుబుకుతోంది. గతంలో తన తండ్రి పట్ల తాను ఎంత నిర్దయగా ప్రవర్తించాడు. ఇపుడు అంతకు అంత తాను తన కొడుకు ద్వారా అనుభవిస్తున్నాడు. చరిత్ర పునరావృత మవ్వడంమంటే ఇదేనేమో!

ఇక్కడ సూర్యరామం కుటుంబం గురించి కొంచెం చెప్పవలసి ఉంది. ఆయన ప్రభుత్వ ఉద్యోగి. ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఆడిటర్‌గా పనిచేసి రిటైరైన వ్యక్తి. మంచి జీతం, హోదా, పరపతిగల ఆయనకు భార్య, ఒక్కగానొక్క కొడుకు హరగోపాల్. ఉద్యోగాల పేరిట ఊరూరా తిరుగుతుంటే తండ్రి సీతారామయ్య మొదట్లో పుట్టిన మారుమూల పల్లెటూరిలో జీవనాన్ని సాగించేవాడు.

సూర్యరామానికి కొంచెం 'ఇండివిద్యువాలటీ' పాలు ఎక్కువ. జీవితాన్ని 'ప్రాక్టికల్'గా ఆలోచించేవాడు. బాంధవ్యాలు, చుట్టరికాలు, ఎటాచ్‌మెంట్స్ పెద్దగా గిట్టేవికావు. చుట్టాలు, స్నేహితులంటూ అందర్నీ చేరదీస్తే, అది కావాలని, ఇది కావాలని తనను ఇరకాటంలో పెడతారని అతని భావన. చేస్తున్నది ఉన్నత స్థాయి ఉద్యోగం కావడంతో హోదా, దర్పం అతనిలో ఎక్కువగా కనిపిస్తూ ఉండేవి. తన చదువు, ఉద్యోగస్థాయి అంతా తన ప్రతిభా పాటవాలవల్లనే వచ్చినవని విర్రవీగేవాడు. తాను కష్టపడడం వల్లనే ఆ స్థాయికి చేరుకున్నానని అతని భావన. అతని తండ్రి సీతారామయ్య పెద్దగా చదువుసంధ్యలు లేని మధ్యతరగతి కుటుంబీకుడు.

మొదటినుంచీ సూర్యరామం సీతారామయ్యని పెద్దగా లెఖ్ఖ చేసేవాడు కాదు. తల్లిదండ్రుల పట్ల విధేయత, మమకారం అంతా 'ట్రాష్' అనుకొనేవాడు. కారణంగా వార్ధక్యంలో తండ్రిని తన దగ్గర ఉంచుకొని, కొడుకుగా, వృద్ధాప్యంలో తన తండ్రికి సేవలందించవలసిన కర్తవ్యాన్ని మరచి 'వృద్ధాశ్రమం'లో జాయిన్ చేశాడు. ప్రతినెల తండ్రి పోషణ నిమిత్తం కొంత, ఆశ్రమానికి మరికొంత సొమ్ముల్ని చెల్లించి తన బాధ్యత తీరిపోయినట్లు భావించేవాడు. ఇతరులకన్నా ఎక్కువ సొమ్ముల్ని తన స్థాయికి తగ్గట్లు ఇస్తూంటే అందరూ అతన్ని ఆకాశానికి ఎత్తేశేవారు. ధర్మాత్ముడనో, దానకర్ణుడనో అతన్ని అందరూ కీర్తిస్తూంటే, తనను కనీసం వచ్చి పలకరించని కొడుకుని చూసి వేదనతో తల్లడిల్లిపోయేవాడు సీతారామయ్య.

ఏ తండ్రి అయినా వయసు పైబడి, శరీరం గతి తప్పిననాడు కోరుకొనేది డబ్బుకాదు, ఆస్తిపాస్తులు కావు, మనసును సేదదీర్చే తన వారి ప్రియమైన మాటలు, తనపై చూపించే మమకారం, అందిస్తున్న చేయూత. సీతారామయ్య ఆశించినవి ఆ ఓల్డేజ్ హోమ్‌లో లభించక తల్లడిల్లేవాడు. ఆ ఆశ్రమంలో ఆయనకి బ్రతుకు చాలా కృత్రిమంగా తోచేది. కని, పెంచి, పోషించి, విద్యాబుద్ధులు నేర్పించిన తండ్రిని చరమాంకంలో పూర్తిగా విస్మరించడంతో తల్లడిల్లి, ఆవేదనతో కన్ను మూశాడాయన.

సూర్యరామానికి తండ్రి మరణం పెద్దగా బాధ అనిపించలేదు. ఆయన టైం అయి వెళ్లిపోయాడని ఓ నిట్టూర్పు విడిచాడేగాని, కొడుకుగా తన బాధ్యతల్ని విస్మరించడాన్ని గుర్తించలేకపోయాడు.

ఇక సూర్యరామం కొడుకు హరగోపాల్. ఫీలింగ్స్, సెంటిమెంట్ అంటూ ఏమీలేని తను, తన కొడుకుని పెంచి పెద్దజేసి చదువు సంధ్యలు చెప్పించాడేగానీ ఓ తండ్రిగా బ్రతుకు బాటలో అంతర్లీనమైయున్న సున్నితత్వాన్ని విస్మరించాడు. హరగోపాల్ చదువుల కారణంగా చాలా కాలం రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజి హాస్టల్స్‌లో నే ఉండిపోయాడు. కారణంగా, హరగోపాల్ పెరిగి పెద్దవాడైనా, పేరెంట్స్ మీద సెంటిమెంట్ ఎస్టాబ్లిష్ కాలేదు. పైగా శలవులకు ఎప్పుడైనా ఇంటికి వచ్చినప్పుడు వృద్ధాప్యంలో తమ పంచన చేరిన తాతగారికి తన తండ్రి ఇచ్చే నెగిటివ్ ట్రీట్‌మెంట్ అతని మనసులో గట్టిగా ఎస్టాబ్లిష్ అవసాగింది. తెలిసీ తెలియని వయసులో అదే జీవితమనుకొనేవాడు.

నిరంతర ప్రవాహం లాంటి కాలవాహినిలో రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు పడి కొట్టుకుపోతూనే ఉంటాయి. కదులుతున్న కాలంలో ఆ కుటుంబంలోని స్థానాలు మారాయి. ఉద్యోగం నుండి పదవీ విరమణ చేసిన సూర్యరామం, మంచి ఉద్యోగస్తునిగా స్థిరబడ్డ గోపాల్, వార్ధక్యంలో పడ్డ సూర్యరామానికి కన్నవారి సహకారం ఇప్పుడు అవసరం అయింది. దాని విలువ నెమ్మదిగా తెలియవస్తోంది. అలసిన మనసు తనవారి నాలుగు తీయని మాటలు, ఓదార్పును కోరుకుంటోంది. కానీ కొడుకు కోడలు తనని అస్సలు పట్టించుకోకపోవడం అతన్ని తీవ్రంగా వేధించసాగింది.

0000

"ఏరా రామం ఏమిటి అలా దిగాలుగా ఉన్నావు. ఒంట్లో బాగాలేదా లేక ఇంట్లో ఏదైనా గొడవ జరిగిందా!" మిత్రుడు ఆంజనేయులు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు సూర్యరామం.


ఆంజనేయులు సూర్యరామానికి బాల్య స్నేహితుడు. బాధని గాని, సంతోషాన్నిగాని నిస్సంకోచంగా చర్చించుకో దగ్గ స్నేహం వారిది.

"ఏమి చెప్పమంటావురా! మావాడు ఏదో చిన్న పని పురమాయించాడు. బయటికి వెళ్లడానికి నిన్నటి నుండి ఒక్కటే ఆయాసం. చెప్పిన పని చేయలేదని ముందూ వెనుకా ఆలోచించకుండా ఈసడించుకొని వెళ్లిపోయాడు. వెధవ బ్రతుకు అయిపోయిందిరా! ఇక ఎవరి గురించి బ్రతకాలో తెలియడం లేదు. ఆ ఏడుకొండలవాడు త్వరగా నన్ను తీసుకుపోయినా బాగుణ్ణు."

"ఎందుకురా అలా బాధ పడతావు. అవన్నీ వదిలేసి నాతోరా! ఈరోజు శ్రీరామ నవమి సందర్భంగా మా ఇంట్లో సత్సంగం ఏర్పాటు చేశాం. మా అబ్బాయి కోడలు నిన్ను, మీ గోపాల్‌ని తప్పకుండా తీసుకురమ్మన్నారు. ఆ కార్యక్రమం తరువాత ఈ పూట మా ఇంట్లోనే భోజనాలు."

సూర్యరామానికి ఎందుకో మొదటినుంచి ఆంజనేయులులో నిజమైన స్నేహితుడు కనిపిస్తాడు. అతను తన చిన్ననాటి క్లాస్‌మేట్. ఆర్థిక ఇబ్బందుల వలన తనలా పై చదువులు చదివి పెద్ద ఉద్యోగాలలో స్థిరపడకపోయినా, ఉన్నంతలో జీవితాన్ని మంచిగానే సాగించేవాడు. డబ్బు మదంతో, కళ్లుగప్పిన అధికార దర్పంలో సూర్యరామానికి, ఆంజనేయులంటే ఒకింత చిన్నచూపు ఉండేది. జీవితపు విలువల్ని, సంస్కారాన్ని అతను ఆకళింపు చేసుకున్నంతగా తాను చేసుకోలేకపోయాడు.

"ఏరా అంజీ! ఎందుకురా ఆ ముసలి వాళ్లంటే అలా పడి ఛస్తావు. ఏదో నిన్ను కన్నారు, కన్నందుకు నిన్ను పెంచి పెద్దచేసారు. దానిలో వారి గొప్పతనం ఏముంది చెప్పు. ఉన్న కాలమంతా వాళ్ల సేవలకే వెచ్చించి, నీ సంగతి నీవు చూసుకోకపోతే ఏమి పైకి వస్తావు చెప్పు. నేను చెప్పిన మాట విని నాలాగ, మీ వాళ్లను కూడ ఏ ఓల్డేజ్ హోంలోనో పడేయి. పీడ విరగడై పోతుంది." కొంచెం నొచ్చుకోవడం ఆంజనేయులు వంతు అయింది.




"రామం ఆ సంగతి వదిలేయి. ఆ ఒక్క విషయంలో మన అభిప్రాయాలు వేరు. చిన్నతనంలో మనం వారి గుండెమీద ఆడుకుంటూ సున్నితంగా తన్నితే, ఆహ్లాదపడే ఆ అమాయకులు, పెద్దయిన తరువాత హృదయం మీద

తన్నితే తట్టుకోగలరా! చెప్పు. మన గురించి తమ సంతోషాలు సహితం ప్రక్కన పెట్టి జీవితాన్ని త్యాగం చేసిన ధన్యులు వారు."

"ఏమో లేరా నీ చాదస్తం నీది. నా మాటలు నీకు సరిపడవులే" ఒక్కమాటలో చెప్పాలంటే తన తల్లిదండ్రుల్ని కంటిరెప్పల్లా చూస్తూ, వారి కష్టసుఖాలు తనవిగా స్వీకరించి, తమ వృద్ధాప్య జీవితాన్ని ఆనందమయం చేసిన ఆంజనేయులు, సూర్యరామంతో బాటు ఎందరో కొడుకులకు ఆదర్శంగా నిలుస్తాడు.

కుటుంబ వ్యవస్థలో ఆంజనేయులు చేసింది కరెక్టు. ఉన్నంతలో చక్కగా బ్రతికి, నాన్నను ప్రేమించి కొడుకును లాలించి వారిద్దరి మధ్య వారధిలా నిలచి జీవితాన్ని రాగమయం చేసుకొన్నాడు.

తను ఈనాడు ఎన్ని లక్షల రూపాయిలు ఖర్చుపెట్టి ఆ అనుబంధాన్ని కొనగలడు. పోయిన తన తండ్రిని తీసుకురాగలడా! వాడిన అనుభుతుల్ని తిరిగి చిగురింపజేయుగలడా! బ్రతుకు బంధంలోని సున్నితత్వాన్ని జారవిడుచుకున్నది తను, ఇప్పుడు ఎంత మధన పడితే మటుకు లాభం ఏముంటుంది.

"ఇప్పుడేమైందని! వాడు కుర్రాడు. తెలిసోతెలియకో ఏదో వాగుతాడు. ఆ మాటల్ని పట్టించుకుని బాధపడితే ఎలా చెప్పు. ఇలాంటి సమస్యలు ప్రతి ఇంటిలో మామూలే. వయసుడిగి కాటికి కాళ్లు చాచి ఆపై వాడి పిలుపు కోసం ఎదురు చూస్తున్న మనం ఇటువంటి వాటికి అతీతంగా ఉండాలి. ఇవన్నీ రోజూ ఉండే మాటలే గాని త్వరగా తయారవ్వు. మావాడు నీకోసం ఎదురు చూస్తూ ఉంటాడు.

000

ఆంజనేయులు కుటుంబాన్ని చూస్తుంటే సూర్యరామానికి ఒక్కోసారి ముచ్చట వేస్తుంది. మరోసారి ఈర్ష్య కలుగుతుంది. గతంలో తనలాగ అతని తల్లిదండ్రుల్ని కూడ ఇంట్లోంచి పంపించి వేయమనడం లాంటి సలహాలు ఇచ్చిన తను ఎంత అవివేకి. అందుకే భగవంతుడు ఈనాడు తనకీ గతి పట్టించాడు.

ఆంజనేయులు ఇంట్లో అంతా చాలా అన్యోన్యంగా ఉంటారు. పెద్దల్ని పిల్లలు గౌరవిస్తే, పిల్లల్ని పెద్దలు లాలిస్తుంటారు. చిన్నచిన్న హాస్యోక్తులతో ఆనందమయంగా ఉండే ఆ ఇంటి వాతావరణం తన ఇంట్లో మచ్చుకైనా కన్పించదు.

"ఓరేయ్! గోపాల్ మీ నాన్న చూడు ఈ వయస్సులో ఎంతగా కుమిలి పోతున్నాడో, స్వతహాగా వాడు చాలా మంచివాడు. నిన్ను కని పెంచి పెద్ద జేసి చదువు సంధ్యలు చెప్పించలేదా! అటువంటి వాడిని ఎందుకురా నీవు చిన్న చూపు చూస్తావు. ఆఖరి దశలో అమ్మా నాన్నల్ని చూడవలసిన బాధ్యత గురుతరమైనది. అదే ఈ జీవితానికి పరమార్థం చేకూరుస్తుంది." తన ఇంటిలో శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన సత్సంగానికి సూర్యరామంతో బాటు వచ్చిన గోపాల్‌ని ఉద్దేశించి అంటే-

"అవును అంకుల్! నాకు కొన్ని అభిప్రాయాలు, ఉద్దేశాలు ఉన్నాయి. మా నాన్న నువ్వు ఇద్దరూ సమకాలీకులు. ఆయన కారణంగా మాతాత నరకయాతన అనుభవించాడు. ముసలితనంలో తన కొడుకు పంచన జేరి ఇతను పెట్టిన బాధలకి క్రుంగిపోయి క్షణమొక యుగంలా బ్రతికిన గత చరిత్ర ఆయనది. వాటిని కళ్లారా చూసిన నేను మా నాన్నలోని చెడును ఆకళింపు చేసుకొన్నాను. అలాగే మీరు నా చిన్నతనం నుంటి మా ఇంటిలో ఒకరుగా మసలేవారు. మీరు మీ నాన్నని పూలపై నడిపించి బ్రహ్మరథం పట్టడం కూడ నాకు తెలుసు. అలా మీలోని మంచిని ఆకళింపు చేసుకున్నాను.

అందుకే సూర్యరామం అంటే ద్వేషభావం
ఆంజనేయులు అంటే స్నేహ భావం."

ఆవేశంగా చెప్పుకుబోతున్న గోపాల్‌ని వింతగా చూస్తున్నారు అక్కడి వారందరు.

"అది సరేలేరా! ఈరోజు పవిత్రమైన శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా మా ఇంటికి వచ్చిన అతిథులు మీరు. శ్రీరామచంద్రుడు పితృవాక్య పరిపాలకుడు. అందుకే ఆయన కర్మభూమి అయిన ఈ భారతదేశంలో యుగయుగాలుగా ఇంటింటి దైవమై పూజింపబడుతున్నాడు. అటువంటి రాముణ్ణి మనం మార్గదర్శకంగా తీసుకోవాలి. ఇక నుండి మీ నాన్న మనసు కష్టపెట్టనని ఈ పవిత్రదినాన నువ్వు నాకు మాట ఇవ్వాలి. ఎప్పుడో మీ నాన్న ఏదో చేశాడని నువ్వు అలా చేయడం మంచి పద్ధతి కాదని నా అభిప్రాయం."

"సరే అంకుల్! మీరు చెప్పిన రామచంద్రుడు నాకు మీలో కనిపిస్తున్నాడు. మీ మాటంటే నాకు గురి. గతంలో మా నాన్నను జవదాటినా, మీ మాటను మాత్రం జవదాటను. మీరు చెప్పినట్లుగానే నడుచుకుంటాను."

శ్రీరామ నవమి సందర్భంగా ఆంజనేయులు స్వగృహంలో ఏర్పాటు చేసిన సహపంక్తిలో ప్రక్క ప్రక్కన కూర్చుని అందరితో సమానంగా ఆనందాన్ని అనుభవిస్తున్న ఆ తండ్రీకొడుకుల్ని ఆంజనేయులు అపురూపంగా చూడసాగాడు. ■

